# రాగింగ్!

కొత్తగా పెట్టిన ఇంజనీరింగ్ కాలేజీలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్లందర్నీ పిలిచి మీటింగు పెట్టి ఆ కాలేజీకింకా ట్రెడిషన్లేర్పడలేదని, మంచివి ఏర్పడేలా చూడటం చెడువాటిని ఆమడ దూరంలో ఆపటం ఎంత ఆవశ్యకమో చెప్పి రాగింగ్ ప్రసక్తి ఎత్తాడు. ప్రొఫెసర్లందరూ దేశంలో రాగింగ్ పేరిట జరుగుతున్న రాక్షసాన్ని గుర్తు చేసుకొన్నారు. మా కొద్దు ఈ తెల్ల దొరల ఆనవాయితీలు అని తీర్మానించుకొని రాగింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకి టిసి లిచ్చేయాలని ఆ విషయంలో ప్రిన్సిపాల్ దృఢంగా నిలబడితే తాము వెనకాతల దన్నుగా నిలబడ్తామని ప్రకటించారు.

మీటింగ్ అయిపోగానే ప్రొఫెసర్లందరూ కాలేజీ గేటుకు గాలివాటు దూరంలో వున్న కేంటీనుకు నడిచి వేడి కాఫీ కప్పుల్ని ముందుంచుకొని కబుర్లు మొదలుపెట్టారు. అవి సహజంగా రాగింగ్ వైపు దొర్లాయి.

సివిలింజనీరింగ్ ప్రొఫెసర్ శర్మ, "మా రోజుల్లో రాగింగ్ అసహ్యంగా వుండేదికాదు మమ్మల్ని మా సీనియర్లు రాగ్ చేశారు! అది తల్చుకొని మేము ఇప్పటికీ నవ్వుకొంటూ ఉంటాం. మాది ఆంధ్రాయూనివర్శిటీ సెకండ్ బాచ్. ఆ క్రితం ఏడే విశాఖపట్నంలో యింజనీరింగు కాలేజీ పెట్టారు. మా సీనియర్సు ఎక్కువ మంది జామెట్రికల్ డ్రాయింగులో ఫెయిల్ అయ్యారు. అందుకని ఆ సబ్జెక్టుని జిడ్డు జి.డి. అనేవారు. దాన్ని అప్పారావు గారనే మేష్టారు టీచ్ చేసేవారు. ఆయన ముక్కోపి అనీ మా సీనియర్స్ మాకు ముందుగానే చెప్పారు, జి.డి. మొదటి పాఠం నాడు మేము జె.వి.డి. కాలేజీ లెక్చర్ హాల్లో భయంకరంగా కూర్చున్నాం. సరిగ్గా 7-30 గంటలకు మేష్టారు క్లాసుకి వచ్చారు.

ఆయన సూటు వేసుకుని చూడటానికి సౌమ్యంగానే కనిపించాడు. కాని క్లాసులోకి రాగానే పాఠం మొదలు పెట్టాడు. ఆలస్యంగా వచ్చిన వాళ్ళని తలుపు దగ్గరే నిలబెట్టాడు కస్సుమన్నాడు. బుస్సుమన్నాడు ఐసోమెట్రిక్ ప్రొజెక్షన్‌కి, ఫర్ స్పెక్టివ్ ప్రొజెక్షన్‌కి తేడా చెప్పమని మనిషి మనిషిని అడిగాడు. క్లాసు క్లాసంతా బిక్క మొహం వేసి నిలబడింది. బుధవారం క్లాసుకి నేర్చుకొని రాకపోతే తోక కోసేస్తానన్నాడు. మీ సీనియర్స్‌లో నూటికి పాతిక మందైనా పాస్

అయ్యారు. మీరు ఆ మాత్రం కారని తిట్టాడు. ఆయన శాపం ఫలించలేదు. మా బాచ్‌లో మేం నూటికి ముప్పై మూడు మందిమి పాస్ అయి సీనియర్సు మీద ఇంప్రూవ్ మెంటు సాధించాము. అది వేరే విషయం.

ఆ రోజు లంచ్ టైములో సీనియర్సు మమ్మల్ని పరామర్శించి, ఆయన నమస్కార ప్రియుడని రోజు కెన్నిసార్లు కనిపిస్తే అన్నిసార్లు నమస్కారం పెట్టాలని లేకపోతే క్లాసు మార్కులు సరిగా వేయడని, పెడ్తే అంత ప్రమాదకరమైన వ్యక్తి కాదని ధైర్యం నూరి పోశారు. మేము ఆ మధ్యాహ్నం నుంచీ ఆయన కనపడగానే రెండు చేతుల జోడించి నమస్కారం పెట్టడం మొదలుపెట్టాం. డి.ఎ.లో వ్రాసిన పుస్తకం కొనేశాం. ఆ సాయంత్రం బుధవారం క్లాసుకి బాగా చదువుకొని టైముకి వెళ్ళి గుండెలరచేత్తో పట్టుకుని కూర్చున్నాం. జి.డి. మేష్టరుగారి కోసం ఎదురు చూస్తున్నాం.

ఓ గోవు లాంటి ఆయన క్లాసుకు వచ్చాడు. ఆయనకి మేము "ఇది జి.డి. క్లాసు. ఫస్టియర్ వాళ్ళది. మీది కాదు అప్పారావు గారిది" అని చెప్పాం.

"నేనే అప్పారావుని" అని ఆయన చెప్పారు. సీనియర్సు మమ్మల్ని రాగ్ చేయాలని పథకం వేసినట్టు చూచాయిగా విని వుండటంచేత ఆయన్ని సరిగ్గా పాఠం చెప్పనివ్వక అడ్డదిడ్డమైన ప్రశ్నలతో విసిగించి ఎగతాళీ చేశాం. ఆయనకి కోపం వచ్చి వెళ్ళిపోయాడు.

శుక్రవారానికి మాకు తెలిసింది. బుధవారం వచ్చిన గోవే మా అసలు మేష్టరనీ సోమవారం వచ్చిన అప్పారావు ఒడ్డూ పొడుగూ వున్న సీనియరు బడుద్దాయి అనీ అతని పేరూ అప్పారావే అనీను.

అసలు అప్పారావు గార్ని ప్రసన్నం చేసుకొనేసరికి ఓ పదిక్లాసులు పట్టాయి.

"ఇదిగో రాగింగ్ ఇల్లా వుంటే చేయబడ్డ వాళ్లు కూడా యెంజాయ్ చేస్తార" ని ప్రొఫెసర్ శర్మ ముగించాడు.

కాకినాడలో మొదటి బాచ్ 1950లో బయట పడింది. మేం 1958లో పాస్ అయ్యాం అంటూ మెకానికల్ ప్రొఫెసర్ ఆలీ మొదలుపెట్టాడు-

ఆ రోజుల్లో యింజనీరింగులో చేరాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కావాల్సి వచ్చేది. అయితే సీటు వచ్చిన ప్రతి కుర్రాడు అయిదు రూపాయలు సమర్పించుకుని యెవరో ఒక రిజిష్టర్డు ప్రాక్టీషనర్ దగ్గర్నుంచి సర్టిఫికేట్టు సంపాదించేవాడు. అందుకని మా కాలేజీలో మా కాలేజీ డాక్టరు దగ్గర చెకప్ చేయించుకోవాలి కొత్త విద్యార్థులు అని ప్రిన్సిపాల్‌గారు నిర్ణయం చేసినట్టు వార్త గాలిలో కలిసి, సరిగాలేని విద్యార్థులకి ఎడ్మిషన్స్ కాన్సిల్ చేస్తారని, కొందరికి పి.టి. క్లాసులు పెడతారని రకరకాల పుకార్లు పరిమళాలుగా పోగేసుకొని పాకిపోయాయి. ఎడ్మిషన్లు మొదలయ్యాయి. జీతాలు కట్టేచోట బయట ఓ గుమాస్తా ఓ స్లిప్ యివ్వటం మొదలు పెట్టాడు, అందులో విద్యార్థులు చేయించుకోవలసిన మెడికల్ చెకప్ గురించిన వివరాలు ఉన్నాయి.

జీతాలు కట్టిన విద్యార్థులందరూ చెకప్ కోసం ప్రత్యేకం తెరిచిన ఆరోగ్య కేంద్రం దగ్గర నిలబడ్డారు. డాక్టరు ఒక్కొక్కళ్ళనే పరీక్షించి అన్ ఫిట్, నీడ్స్ ఎక్సర్‌సైజ్, ఫిట్ అని సర్టిఫికేట్లు యిస్తాడని అక్కడి కాంపౌండర్ చెప్పాడు. ఎగ్జామినేషన్ ఫీజు రెండేసి రూపాయలు తీసుకొని రసీదు లిచ్చాడు.

చాలా మందికి నీడ్స్ ఎక్సర్‌సైజ్ ఫర్ ఎ వీక్ అని వ్రాసాడు. కొంతమందికి నెల, రెండు నెలలు కూడా ప్రిస్ క్రైబ్ చేసాడు. కొందర్ని అన్‌ఫిట్ అన్నాడు. వాళ్ళంతా గోలపెట్టి ఆయన దగ్గర ఏడ్చారుట. మరో రెండు రూపాయలు తీసుకుని ఏడాదంతా జిమ్‌నేషియం ఎటెండయ్యే ఒప్పందం మీద వాళ్ళకి అన్ ఫిట్ సర్టిఫికేటు కాన్సిలు చేసాడు.

ఫిజికల్ ట్రయినింగు మర్నాడే మొదలయింది. ప్రొద్దున్నే ఆరింటికి మొదటి రోజున హాస్టల్సు చుట్టూ అయిదు రౌండ్సు కొట్టించాడు, పి.టి. టీచర్. రెండో రోజు ముప్పయి గుంజీలు తీయించాడు. అల్లా రోజుకో కొత్తరకం ఎక్సర్‌సైజు చేయించాడు. వారం అయ్యాక అందరి చేత లెవెలింగ్ ఇన్‌స్ట్రుమెంటు ఓ మైలు దూరం మోయించి "నౌ యూ ఆర్ ఫిట్" అన్నాడు.

పదో రోజున ఫ్రెషర్స్ డే అయింది. జూనియర్సుకి సీనియర్సు పార్టీ యిచ్చారు, పాటలు పాడారు, చివరన డాక్టరు వచ్చి ఈ రోజు పార్టీకైన ఖర్చు జూనియర్సే భరించారు, మెడికల్ చెకప్‌కి అంటూ ఇచ్చిన డబ్బు ఈ రోజు వాడాం. మా జూనియర్సు ఈ పాటికి నేను, జీతాల దగ్గర గుమాస్తా, కాంపౌండరు, పి టి టీచర్ అంతా మీ సీనియర్సుమేనని గుర్తించి వుంటారు, అన్నాడు

జూనియర్సు ఆశ్చర్యపోయి, ఆ పైన చప్పట్లు కొట్టారు నవ్వుకొంటూ. వాళ్ళని మా బాచ్ అలా రాగ్ చేసినందుకు వాళ్ళకి కోపము రాలేదు, వాళ్లు మరోసారి మెడికల్ చెకప్ చేయించు కోవాల్సిన వచ్చింది. అది మరో విషయం" అని ప్రొఫెసర్ ఆలీ తన బాచ్ చేసిన రాగింగు గురించి చెప్పడం పూర్తి చేసాడు.

చివరగా మిగిలింది ఎలెక్ట్రికల్ ప్రొఫెసర్ రత్నం. ఆయన తమిళనాడు నుంచి వచ్చాడు అందర్లోకి వయసులో పెద్దవాడు. శర్మ, ఆలీ రత్నాన్ని "మీ రోజుల్లో రాగింగ్ లేదా!" అని అడిగారు.

మా రోజుల్లో డిసిప్లిన్ కొంచెం హెచ్చుగా వుండేది, మేం ఇంజనీరింగులో చేరినది 1949లో. అప్పటికింకా కొందరు తెల్లవాళ్ళు మన దేశం వదిలి పోలేదు. లక్ష్మణస్వామి మొదలియార్, కట్టమంచి రామలింగారెడ్డిలాంటి విద్యావేత్తలు నిరంకుశంగా, నిర్భీతిగా విద్యాలయాలు పాలిస్తున్నారు. ప్రిన్సిపాల్స్ జారీ చేసిన ఆజ్ఞలు సుగ్రీవ ఆజ్ఞలు, మినిష్టర్లు, కాంగ్రెసు (ఐ) మెంబర్లు మేనేజిమెంట్లో కలిపించుకొనేవారు కాదు. అందరు జైళ్ళకి వెళ్ళొచ్చిన బాపతు కాంగ్రెసు వాళ్ళేమో విద్య అంటే గౌరవించేవాళ్లు. పంతులికింత పొగరా అన్నట్లుగాక పంతులుగారు అంటూ గౌరవంగా మసిలేవాళ్ళు మేష్టర్లంటే.

మా ప్రిన్సిపాల్ ఐరిష్. ఆయన క్రిష్టియన్ ఫాదర్. మిషనరీ అయినా మతానికీ, మార్పిడికీ ప్రాముఖ్యం ఇవ్వక చదువుకీ, నడతకీ ప్రాముఖ్యం ఇచ్చి తప్పి చరించినవాళ్ళని సున్నితంగా తిరుగులేని విధంగాను శిక్షించ వాడు.

దాదాలు, రౌడీలు ఎప్పుడూ వున్నారు. మా రోజుల్లోనూ వున్నారు. అమాయకంగా కనిపించే జూనియర్స్‌ని ఏడిపించడం వాళ్ళకో సరదా. చిద్విలాసాలలో అదొకటి.

సుబ్బరామన్ నా పై క్లాసులోంచి నా క్లాసులోకి వచ్చాడు అంటే అతను అక్కడ్నుంచి పడిపోలేదు. అతను అక్కడే వున్నాడు. మేం పైకి వచ్చేవరకు ఆగాడు. అతనికి, కొత్తగా చేరిన జూనియర్సుకి అవినాభావ సంబంధం. హాస్టల్లో జూనియర్సు రూంకి వెళ్ళి ఏడిపించేవాడు. ప్రిన్సిపాల్‌కి రిపోర్టుచేసే ధైర్యం కొత్తగా జాయిన్ అయినవాళ్ళ కుండదు కదా?

అతనికి నచ్చిన ఆట జూనియర్సు రూంకి వెళ్ళి "నా ఈ డ్రెస్ ఎల్లా వుంది?" అని అడగటం.

చిరిగిన బట్టలు, ఈకలు, ఆడవాళ్ళ బాడీలు మొదలైనవి సేకరించుకొని వుంచుకునే వాడు ఈ ఆట కోసం. కొత్తగా చేరిన విద్యార్థులకి 'మీ డ్రెస్ బాగాలేదు' అనే ధైర్యం వుండేది కాదు. బాగాలేదంటే తంతాడేమోనని భయం. సుబ్బరామన్ ఫుట్‌బాల్ ప్లేయర్, బాడీ బిల్డర్. బావుంది అనేవారు.

అంతే! 'బావుంది కదా! అయితే తంబీ ఆ డ్రెస్సు నువ్వేసుకో. నాకొద్దు. నా డ్రెస్ తీసుకొన్నావు కదా. నాకు దాని బదులు చిన్న సర్వీసు చేసిపెట్టు. మన హాస్టలు బయట కొట్టు నుంచి ఓ రెండు అరిటి పళ్ళు తెచ్చియ్యి' అనేవాడు.

వెళ్లాల్సినచోటు, తేవాల్సిన వస్తువు మార్చేవాడు. ఎక్కడెక్కడికి పంపితే తన అల్లరి ప్రిన్సిపాల్ దృష్టికి వెళ్ళదో అక్కడికి పంపేవాడు. బయట టీ కొట్టు వాళ్ళు, వెత్తల్ పాక్ వాళ్లు అందరు సుబ్బరామన్ ఫ్రెండ్స్. ఇబ్బంది పరిస్థితుల్లో వాళ్లు అతనికి ఇబ్బంది కలిగించే సాక్ష్యం చెప్పరు. సీనియర్సెవరు సుబ్బరామన్ మీద పాల్‌గారికి కంప్లయింటు వెడితే అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పేవాళ్ళు కాదు. ఎందుకంటే అతన్లో చెడ్డతనం లేదు. జాలీ పర్సన్. ఏమేడ్పించినా మొదటి నెలో, రెండు నెల్లో కొత్త వాళ్ళని ఏడిపిస్తాడు. ఆపైన వాళ్ళని తన జట్టులో కలిపేసుకుని పై కాలేజీ వాళ్ళతోనూ, సినిమా హాళ్ళ వాళ్ళతోను, హోటలు వాళ్ళతోను వీళ్లు తగూలు పడితే వీళ్ళ తరపున దెబ్బలాటకి వెళ్ళేవాడు. అందుకని సీనియర్స్. "అబ్బే, మేం చూడలేద్సార్ అట్లాంటి వాడు అనుకోము" అనేవారు ప్రిన్సిపాల్ అడిగితే.

అదృష్టం ఎప్పుడూ ఒకలా వుండదు కదా! ఓ రోజున పాల్‌గారు ఏదో పని మీద పొద్దున్నే హాస్టలుకి వచ్చాడు. ఆ సమయంలో సుబ్బరామన్ ఓ కొత్త కుర్రాడిని, "ఎలా వుంది నా డ్రెస్?" అని నిలదీస్తున్నాడు.

అతను "బావుంది" అన్నాడు, తన దురదృష్టానికి చింతిస్తూ. అది పాల్‌గారు విన్నాడు. సుబ్బరామన్ డ్రెస్‌కేసి చూశాడు. కానీ చూడనట్లు ముందుకెళ్ళి, "సుబ్బరామన్ ఈజ్ దట్యూ?" అని ప్రశ్నించాడు.

సుబ్బరామన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి కాదనటానికి లేదు. పాల్‌గారికి అందరి గొంతుకలు గుర్తే. మనుష్యుల పేర్లు, తండ్రుల పేర్లు, కులం గోత్రం అంతా ఆయనకి కంఠో పాఠం. అదొక క్రమశిక్షణ. ఆ రోజుల్లో యూరోపియన్ ప్రిన్సిపాల్సు అందరికీ ఆ శక్తి వుండేది.

'పెళ్ళి పెటాకుల్లేని కిరస్తానీ వాళ్ళకి వేరే పనేముంది' అనేవాడు మాకు హైస్కూల్లో తమిళ్ చెప్పిన కుప్పు స్వామయ్యర్.

ఇంతకూ సుబ్బరామన్ విధిలేక, "యస్సార్" అన్నాడు.

"ఐ హేవ్ సమ్ వర్క్ ఫర్ యు ఫాలోమీ" అని ఆయన చక చకా ముందుకు నడిచాడు. సుబ్బరామన్ వెనకాతల నడిచాడు.

ఆయన కారులో డ్రైవింగ్ సీట్లో కూర్చుని సుబ్బరామన్‌ని వెనకాతల కూర్చోమని తన క్వార్టర్సుకి తీసుకెళ్ళాడు.

"ప్లీజ్ బి సీటెడ్" అని లోపలకు వెళ్ళాడు. సుబ్బరామన్ ఇబ్బందీగా కూర్చున్నాడు. పాల్ తనకేసి చూడనందుకు సంతోషించాడు. తన డ్రెస్ ఆ రోజు మరీ ఘోరంగా వుంది.

"సుబ్బరామన్" అని పిలుపు వినిపించింది.

"యస్సార్" లేచి నిలబడి జవాబు చెప్పాడు.

"నువ్వు కూర్చున్న గదిలో షెల్ఫులో పక్కగా పెట్టిన రెండు పుస్తకాలున్నాయి. కనిపిస్తున్నాయా?"

"యస్సార్"

"అవి తీసుకువెళ్ళి దేవసహాయంగారికి ఇయ్యి. నేను ప్రార్థన చేసుకోవాలి. నిన్ను డ్రాప్ చేయలేను ఏమనుకోకు" అన్నాడు, లోపలినుంచే.

సుబ్బరామన్‌కి అర్థం అయింది. పాల్‌గారు తన డ్రెస్ చూసాడు. తనకి బుద్ధి చెప్పాలనే ఈ పన్నాగం పన్నాడు. చూడనట్టు నటిస్తున్నాడు.

"నడిచి వెళ్ళలేను సార్" అంటే-

"ఎందుకు వెళ్ళలేవు?" అంటాడు.

"డ్రస్సు బాగా లేదు" అంటే-

"అటువంటిది ఎందుకు వేసుకున్నావు?" అంటాడు.

చేసేది ఏమీలేక "అల్లాగే సార్" అంటూ ఆ పుస్తకాలు తీసుకొని బయటపడ్డాడు. ఆ రోజు సుబ్బరామన్ చాలా మంది దృష్టినే ఆకర్షించాడు.ఆ తర్వాత ఎప్పుడూ జూనియర్స్‌ని నా డ్రెస్ ఎల్లా వుంది?" అని అతను అడిగిన దాఖలాలు లేవు.

"ఆ రోజు స్బురామన్ అసలు డ్రస్సే వేసుకోలేదు" అంటూ ప్రొఫెసర్ రత్నం ముగించాడు.

అందరు ప్రొఫెసర్లు గొల్లుమన్నారు.

- సమత, బరోడా, '80 •

- సమత, బరోడా, '80

★

# గృహ కవనాలు

1. అర్ధాంగుల ఆర్థిక సూత్రాలు!
2. ఇల్లాలూ - లాజిక్కూ
3. మేడ వేసి చూడు
4. చన్నీళ్ల సముద్రంలో వేణ్ణీళ్ల బొట్టు
5. చట్టం - చుట్టం